


శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
# వార్త






## విధి నిర్వహణలో అంకితభావం పరమేశ్వరలింగం



**కోవూరు, ఏప్రిల్ 30 ప్రభాత వార్త :** పంచాయతీ రాజ్ విభాగంలో గత 42 సంవత్సరా లుగా విధి నిర్వహ ణలో అంకిత భావం చూపు తూ పై అధి కారుల ఆదేశాలను పాటిస్తూ ముందుకు సాగు తున్న ఏకైక వ్యక్తి పరమేశ్వర లింగం అని ఎంపీడీవో శ్రీహరిరెడ్డి కొనియాడారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీరాజ్ ఏఈగా పనిచేస్తూ బుధవారం పదవీ విరమణ చేయనున్న టి. పరమేశ్వర లింగంను మండల పరిషత్ పంచాయ తీరాజ్ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఘనంగా సత్కరించి సన్మానం చేశారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ డీఈ మోహన్‌రావు మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గంలోని కోవూరు, ఇందుకూరుపేట మండలాల్లో 11 సంవత్సరాలకు పైగా ఏఈగా పనిచేసి ఇటు అధికారులు, అటు ప్రజాప్రతినిధుల మన్ననలు కూడా పొందారన్నారు. ఇటువంటి వ్యక్తులను ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఇంకా ఈవోపీఆర్డీ శ్రీనివాసులు, కార్యాలయ పర్యవేక్షకులు ఉషారాణి, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పలు సూచనలు చేశారు. అనంతరం భారీ ఎత్తున పదవీ విరమణ చేసిన ఏఈని ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, తదితరులు ఉన్నారు.

## రైతులు ఎరువును సద్వినియోగం చేసుకోవాలి



**కోవూరు, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** పంచాయతీల్లో చెత్త నుంచి సంపద కేంద్రాల ద్వారా తయారవుతున్న ఎరువులను రైతులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఈవోపీఆర్డీ శ్రీనివాసులు అన్నారు. కోవూరు మండలం ఇనమడుగు పంచాయతీలోని చెత్త సంపద కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలు గ్రామాలను స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేంతుకు తమవంతుగా సహకారం అందించాలన్నారు. ముఖ్యంగా చెత్తను తడి చెత్త, పొడి చెత్త రూపంలో మీ ఇళ్ల దగ్గరకు వచ్చే గ్రీన్ అంబాసిడర్లకు అందజేయాలన్నారు. అదేవిధంగా ఇంటిపన్నులు, కుళాయి పన్నులు సకాలంలో చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగరాజు, తదితరులు ఉన్నారు.

## వేసవి విజ్ఞాన శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి



**కోవూరు, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** కోవూరులోని పచ్చిపాల శంకర్‌రెడ్డి శాఖా గ్రంథాలయంలో బుధవారం వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా జన విజ్ఞాన వేదిక నుంచి ఉపాధ్యాయులు జి. రత్న శేఖర్ మ్యాజిక్ షో నిర్వహించి విద్యార్థులను అలరించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ సురేంద్రరెడ్డి మాట్లాడుతూ ఈ వేసవిలో విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి మహనీయుల చరిత్రలను ఆకళింపు చేసుకోవాలన్నారు. తద్వారా వారి మేదస్సు మరింత ద్విగునీకృత మవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రావు, కార్యదర్శి రంతుల్లా, బి. వెంకయ్య, జయప్రకాష్, జేవీవీ మండల అధ్యక్షుడు గౌస్ లాజామ్, రంగారెడ్డి, తదితరులు ఉన్నారు. శ్రీశ్రీ జయంతిని పురస్కరించుకుని ఆ మహనీయుని చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.

## ఎట్టకేలకు ఆక్రమణలు తొలగింపు



**కోవూరు, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** కోవూరు మండలం ఇనమడుగు సెంటర్‌లో రోడ్డు అభివృద్ధి పనుల్లో భాగంగా ఎట్టకేలకు ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ, పంచాయతీ అధికారులు రోడ్డు ఆక్రమణ తొలగింపుకు శ్రీకారం చుట్టారు. గతంలో ఎన్నిసార్లు నోటీసులు ఇచ్చినా ఆక్రమణదారుల్లో ఎటువంటి స్పందన లేదు. ఈ మేరకు బుధవారం జేసీబీతో మార్కింగ్ చేసినంతవరకు తొలగించే ప్రక్రియ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఏఈ చంద్రశేఖర్, సర్వేయర్ రమేష్, పంచాయతీ కార్యదర్శి హజరత్‌బాబు, తదితరులు ఉన్నారు.

## ప్రతి ఉద్యోగికి పదవి విరమణ తప్పనిసరి



**కోవూరు, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** కోవూరులోని మండల పరిషత్ కార్యాలయంలో సబార్డినేట్‌గా పనిచేస్తూ బుధవారం పదవీ విరమణ చేసిన పి. సుబ్బారావుకు మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ కార్యాలయ అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీహరిరెడ్డి మాట్లాడుతూ సుబ్బారావు గత 10 సంవత్సరాలుగా కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తూ విధి నిర్వహణలో అంకితభావం చూపడమే కాకుండా అధికారులు చెప్పిన ప్రతి విషయాన్ని సక్రమంగా నిర్వహించే వారన్నారు. అటువంటి వ్యక్తులను ప్రస్తుతం ఉద్యోగంలో చేరుతున్న యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఎన్నికల సమయంలో రాత్రుల వేళల్లో 12 గంటల సమయంలో కూడా విధి నిర్వహణలో అంకితభావం చూపేవారన్నారు. అటువంటి పదవి విరమణ చేయడం బాధగానే ఉన్నా ఉద్యోగంలో ఉన్న వ్యక్తి పదవి విరమణ తప్పదన్నారు. ఉద్యోగంలో ఉన్నప్పుడు తాము ఏమి చేశామో ఒకసారి ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. ఎంపీపీ టి. పార్వతి, ఉపాధ్యక్షుడు నరసింహులురెడ్డి, ఈవోపీఆర్డీ శ్రీనివాసులు తదితరులు ప్రసంగించారు. అనంతరం సుబ్బారావు దంపతులను శాలువా, పుష్పమాలతో ఘనంగా సన్మానించారు.

## ప్రమాద స్థలిని పరిశీలించిన అధికారులు




**కోవూరు, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** కోవూరు మండలం పోతిరెడ్డిపాలెం పంచాయతీ పరిధిలోని గంగవరం కాలువ వద్ద బుధవారం మధ్యాహ్నం జరిగిన కారు ప్రమాద స్థలాన్ని తహసీల్దార్ నిర్మలానందబాబా, కోవూరు సీఐ సుధాకర్‌రెడ్డిలు నిశిత పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా వారు ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో కారు పూర్తిగా ధ్వంసం కావడం జరిగింది. దీనికి తోడు రమణయ్య ఇంటి ముందు భాగం కూడా పూర్తిగా ధ్వంసం కావడంతో అధికారులు వాటిని పరిశీలించి అవాక్కయ్యారు. ఈ పరిశీలనలో డిప్యూటీ తహసీల్దార్ నాసర్, గ్రామ రెవెన్యూ అధికారి నాగేశ్వరరావు, ఏఎస్సై సత్యనారాయణ, గ్రామస్తులు పొంగూరు సుబ్బారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు నాగరాజు సంఘటనా స్థలంలో ఉండి పలు సహాయక చర్యలు చేపట్టారు.

## సీహెచ్‌సీ సూపరింటెండెంట్‌గా లీలావతి



**కోవూరు, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రం సంబంధించి సూపరింటెండెంట్‌గా గైనకాలజిస్ట్ పి. లీలావతి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు సూపరింటెండెంట్‌గా ఉన్న వెంకటాచలపతి గౌడ్ పూర్తి బాధ్యతలను లీలావతికి అప్పగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సహచర వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, పారిశుధ్య సిబ్బంది సహకారంతో ఈ ఆరోగ్య కేంద్రాన్ని అన్ని రంగాల్లో ముందంజలో ఉండేలా తగు చర్యలు తీసుకుంటామన్నారు. బాధ్యతలు స్వీకరించిన లీలావతిని సహచర వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, అభినందించారు.

## సింహాచలం ఘటన కలచివేసింది : ఎమ్మెల్యే



**కోవూరు, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** సింహాచలం వరాహలక్ష్మీ నరసింహ స్వామివారి చందనోత్సవానికి వచ్చిన భక్తులపై గోడ కూలి 8 మంది మృతి చెందడం తనను తీవ్రంగా కలచివేసిందని కోవూరు శాసన సభ్యురాలు శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. భారీ వర్షానికి గోడ కూలి ఈ దుర్ఘటన చోటు చేసుకోవడం బాధించిందన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అలాగే గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.25 లక్షల పరిహారం ప్రకటించిందన్నారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని ఆమె వెల్లడించారు.

## ప్రోటోకాల్ ఉల్లంఘించిన పంచాయతీ రాజ్ అధికారులపై చర్యలు తీసుకోండి



**నెల్లూరు కలెక్టరేట్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త** నెల్లూరు రూరల్ మండలం సౌత్ మోపూరు గ్రామము,జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణపు పనిని శంఖుస్థాపన కార్యక్రమము జిల్లా ప్రజా పరిషత్ 15వ ఆర్థిక సంఘ నిధులతో మంజూరు చేసిన పనికి శంఖుస్థాపన కార్యక్రమమునకు ఆహ్వానించకనే సంబంధిత పంచాయతి రాజ్ ఇంజనీరింగ్ అధికారులు నిర్వహించడమైనది. కావున కార్యక్రమమునకు స్థానిక ప్రజా ప్రతినిధి అయిన నన్ను ఆహ్వానించక ప్రోటోకాల్ ఉల్లంఘించిన సంబంధిత పంచాయతీ రాజ్ అధికారులపై శాఖా పరమైన కఠిన చర్యలు తీసుకొనవలసినదిగా భవిష్యత్తులో ఇటువంటి ప్రోటోకాల్ ఉల్లంఘనకు తావ్వికుండా జిల్లా అధికారులకు తగు సూచనలు జారీచేయవలసినదిగా మిమ్ములను కోరడమైనది.

## కారు ప్రమాదంలో వైద్య విద్యార్థుల మృతిపై పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి దిగ్భ్రాంతి



**నెల్లూరు రూరల్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త** నెల్లూరు జిల్లా కోవూరు మండలం పోతిరెడ్డిపాలెం వద్ద జరిగిన కారు ప్రమాదంలో ఆరుగురు మృతి చెందడంపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు సిటీ ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇటువంటి దుర్ఘటన చోటు చేసుకోవడం అత్యంత బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడ్డ వారికి మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం సత్వరమే ఆదుకోవాలని కోరారు.

## ప్రజలకు పథకాలు అమలు చేయండి అంటే నోటీసులు -ఆర్ పి ఐ



**నెల్లూరు కార్పొరేషన్,ఏప్రిల్ 30 ,ప్రభాతవార్త:** గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసి పర్యటనలు జరుపుకోవాలని అన్నందుకు పోలీసులు నోటీసులు ఇవ్వడం దారుణంగా ఉందని బుధవారం స్థానిక గాంధీ బొమ్మ ఆర్ పి ఐ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆర్ పి ఐ పార్టీ జిల్లా అధ్యక్షులు ఎస్ కే. మాబు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడిగినందుకు నోటీసులు ఇవ్వడం , అధికారాన్ని అడ్డుపెట్టుకొని ప్రజల గొంతును నొక్కేయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా రాజాధికారాన్ని అనుభవిస్తున్న కూటమి ప్రభుత్వానికి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టపు రంగారావు. నంబూరు గణేష్. దుంపల సుబ్బారావు. బత్తల మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు

## 15వ ఆర్థిక సంఘం నిధులు సమానంగా పంచాలి



**బుచ్చి ఏప్రిల్ 30 ప్రభాతవార్త** దామరమడుగు పంచాయితీ పరిధిలో పెండింగ్ సమస్యలపై గ్రామ ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. పంచాయితీ కార్యదర్శి రాధాకృష్ణను కలిసి వినతి పత్రం అందజేశారు. పంచాయితీ పాలకులు 15వ ఆర్థిక సంఘం నిదులు గ్రామంలోని అన్ని ప్రాంతాలకు సమానం పంచాలని వారు కోరారు. పల్లిపాళెం, రామచంద్రారెడ్డినగర్, కాలువ కట్ట, గిరిజన కాలనీ మొదలైన ప్రాంతాలలో పారిశుధ్యం పడకేసిందని. వర్షాలు వచ్చినప్పుడు రోడ్ల మీద మురుగునీరు చేరి ఇండ్లలోకి వచ్చి దాని ద్వారా అక్కడ నివసించే ప్రజలకు అనేక అనారోగ్యాలు వస్తున్నాయని వారు తెలిపారు. తెలుగుదేశం పార్టీ వచ్చిన తరువాత పంచాయితీలకు పుష్కలంగా నిధులు అందజేసినా మాకు న్యాయం జరగడం లేదని ఇక కొద్ది నెలలో ఈ పంచాయితీ పాలన ముగుస్తుందని అందుబాటులో ఉన్న నిధులతో ఈ రెండు ప్రాంతాలకు పంపిణి చేసి న్యాయం చేయాలని వారు కోరారు. ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి స్దానిక ప్రజల కోరిక మేరకు రామచంద్రారెడ్డి నగర్ ప్రజల దాహార్తిని తీర్చుటకు నీటి శుద్ధి ప్లాంట్ మంజూరు చేశారు. కాని దానికి ఎన్నిసార్లు వినతి చేసిన స్దలం కేటాయించడంలేదని వారు ఆరోపించారు. స్దలం కేటాయించిన ఎడల ఆ ప్రాంతంలోని ప్రజలందరికి మంచినీరు రాదు అందువల్ల వెంటనే స్దలం కేటాయిస్తే ఆప్రాంత ప్రజలకు మంచి నీరు లభిస్తుందని అన్నారు. గ్రామ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఉన్న పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ అద్యక్షులు చేజర్ల మహేష్, ప్రధాన కార్యదర్శి ఎస్‌డి మస్తాన్, ఉపాధ్యాక్షులు మట్టిపల్లి చంద్రమోహన్, గండవరపు రామచంద్రయ్య, కోశాధికారి కోర్ణ శేషుకుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కొల్లూరు విష్ణు, స్దానిక తెలుగుదేశం నాయకులు పీతల చిన్నా, గోళ్ళ సుమంత్‌కుమార్, తెలుగు రైతులు నాయకులు తోట వెంకటేష్, తోటదొరబాబు, బిసిసెల్ నాయకులు తోట శ్రీనివాసులు, మన్నెపల్లి కమలేంద్ర, మన్నెపల్లి వివేక్, రాజేష్ తదితరులు పాల్గోన్నారు.

## దామిశెట్టి ఉత్తరక్రియల్లో పాల్గొన్న వైసిపి నేతలు



**కావలి, ఏప్రిల్30 ప్రభాతవార్త** కావలిలో ఇటీవల మృతిచెందిన వైసిపి సీనియర్‌నేత దామిశెట్టి శ్రీనివాసులునాయుడు ఉత్తరక్రియల్లో వైసిపినేతలు బుధవారం పాల్గొన్నారు. దామిశెట్టి చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రగాఢసానుభూతిని వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ మేరిగ మురళి, కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, వైసిపి నెల్లూరు రూరల్ ఇన్‌చార్జి ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి, కావలి పట్టణ, మండల వైసిపి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెలుగుమహిళ అధ్యక్షురాలిపై వైసిపి నాయకుల దాడి




**కావలి, ఏప్రిల్30 ప్రభాతవార్త** బ్రాహ్మణక్రాక గ్రామానికి చెందిన జలదంకి మండల తెలుగుమహిళా అధ్యక్షురాలు మేదరమెట్ల ప్రశాంతికుమారిపై వైసిపి నాయకులు దాడులు చేయడంతో తీవ్రంగా గాయపడి కావలి ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. బుధవారం వైద్యశాలలో చికిత్స పొందుతున్న తెలుగుమహిళా అధ్యక్షురాలు ప్రశాంతి కుమారి మాట్లాడుతూ బ్రాహ్మణక్రాక గ్రామానికి చెందిన వైసిపి నాయకులు మల్లారెడ్డి, వాకా శ్రీనివాసులురెడ్డి, సూదలగుంట కృష్ణారెడ్డిలు మూకుమ్మడిగా కర్రలతో దాడిచేశారని ఆమె వాపోయింది. తీవ్రంగా గాయపడిన తనను కావలి ఏరియా వైద్యశాలకు కుటుంబసభ్యులు తరలించారన్నారు. మా కుటుంబంలో ఆస్తి తగాదాలు ఉన్నాయని అవి కోర్టులో కొనసాగుతున్నాయని ఆమె తెలిపారు. అయితే, తన పొలంలోగడ్డిని మేము తరలిస్తుండగా వైసిపి నాయకులు నాపై దాడిచేశారన్నారు. మహిళ అని చూడకుండా బట్టలు చింపేసి తనను, తన కుటుంబాన్ని చంపేస్తామని బెదిరించారని ఆమె భోరున విలపించారు. తెలుగుదేశం పార్టీ మండల మహిళాఅధ్యక్షురాలు అయిన తననే దాడిచేసి గాయపరిస్తే సామాన్యుల పరిస్థితి ఏమిటని ఆమె ప్రశ్నించారు. దాడిచేసినవారిని కఠినంగా శిక్షించాలని ఆమె డిమాండ్ చేశారు.

## మధుసూధన్ కుటుంబాన్ని పరామర్శించిన రాజ్యసభ సభ్యులు బీద



**కావలి, ఏప్రిల్30 ప్రభాతవార్త** ఉగ్రదాడిలో మృతిచెందిన మధుసూధన్ కుటుంబాన్ని రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు బుధవారం పరామర్శించారు. జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఎంపీలందరం కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసి న్యాయం చేస్తామన్నారు. చంద్రబాబుద్వారా ప్రధాని మోడీని కలిసి అన్ని విధాలుగా అండగా ఉండేలా చూస్తామన్నారు. ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాదులను ఏరివేయాలని ఆయన కోరారు. టూరిస్ట్‌లపట్ల ఇంత అమానుషంగా ప్రవర్తించడం దారుణమన్నారు. రాజ్యసభ సభ్యులు బీద వెంట మాజీ మున్సిపల్ ఛైర్మన్ నగళ్ల శ్రీనివాసకిరణ్, వైసిపి వాణిజ్యవిభాగం రాష్ట్ర ప్రధానకార్యదర్శి అమరా వేదగిరి సుబ్బరాయుడు గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు చెన్ను పరమార్శ



**రాపూరు, ఏప్రిల్ 30 ప్రభాతవార్త** మండల కేంద్రమైన రాపూరులోని తిక్కన పార్కు వద్ద రోడ్డుపై 15 రోజుల క్రింతం జరిగిన ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలను బుదవారం పెంచలకోన దేవస్థానం సేవా కమీటీ ఛైర్మన్ చెన్ను తిరిపాల్ రెడ్డి పరామర్శించా రు. రాపూరులో మృతుల నివాసానికి వెల్లిన ఆయన వారి మృతిపట్ల సంతాపం తెలిపి వారి కుటుంబసభ్యు లను ఓదార్చారు. అనంతరం ఆయన ప్రభుత్వం నుండి వారికి ఎమైనా రాయితీలు వచ్చే వీలువుంటే ఎమ్మేల్యే కురుగోండ్ల రామకృష్ణ ద్వారా వారికి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈయన వెంటనాయకులునల్లవడ్ల వెంకటరమణారెడ్డి, గజరాకిం ణ్,జనసేననాయకులుజల్లెళ్ళ రాజేష్ తదితరులున్నారు.

## రాజుపాలెంలో ఆర్‌ఓ ప్లాంట్‌ను అందచేసిన డాక్టర్ రామస్వామి



**కావలి, ఏప్రిల్30 ప్రభాత వార్త** కలిగిరి మండలం కృష్ణారెడ్డిపాలెం సమీపంలోని రాజుపాలెంలో కావలి డాక్టర్ రామస్వామి మల్టీస్పెషాలిటి వైద్యశాల ఛైర్మన్ డాక్టర్ మంచిగంటి రామస్వామి ఆర్‌ఓ ప్లాంట్‌ను బుధవారం అందచేసి గ్రామ స్తుల ప్రశంసలు అందుకున్నా రు. రాజుపాలెంలో నీటిసమ స్య ఉందని గ్రామపెద్దలు డాక్టర్ రామస్వామికి తెలియ చేశారు. వెంటనే ఆయన స్పందించి రాజుపాలెంలో ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటుచేసి అందరి మన్నలను పొందారు. వైద్యంతోపాటు దాతృత్వం ప్రకటిస్తున్న డాక్టర్ రామస్వామిని గ్రామస్తులు కొనియాడారు.

## రైలు ఢీకొని వ్యక్తి మృతి

**నెల్లూరు క్రైమ్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త :** నెల్లూరు నగరంలో ని అయ్యప్ప గుడి రైల్వే ఫ్లై ఓవర్ వంతెన సమీపంలో ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో సుమారు 45 ఏళ్ల వయసు కలిగిన వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. మృతుడు మెరిన్ కలర్ ఆఫ్ హ్యాండ్ షర్ట్, ఆకు పచ్చపై తెలుపు డిజైన్ లుంగీ, బిస్కెట్ కలర్ ధరించి ఉన్నట్టు రైల్వే పోలీసులు తెలిపారు. సంఘటన స్థలానికి చేరుకున్న రైల్వే ఎస్సై మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

## మితిమీరిన వేగం.. అదుపు తప్పిన కారు

- ధ్వంసమైన కారు , ఇల్లు
- ఆరుగురు మృతి
- పోతిరెడ్డిపాలెంలో జరిగిన దుర్ఘటన



**కోవూరు, ఏప్రిల్ 30 ప్రభాతవార్త : అప్పటిదాకా ఓ** ఫంక్షన్‌లో ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపిన మెడికో విద్యార్థులు గంట లోపల మృత్యువాత పడిన సంఘటన పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు మండలం పోతిరెడ్డిపాలెం గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. కోవూరు సీఐ వి. సుధాకర్‌రెడ్డి సమాచారం మేరకు నెల్లూరులోని నారాయణ మెడికల్ కళాశాలకు చెందిన ద్వితీయ సంవత్సరం మెడికో విద్యార్థులు రెండు కార్లలో బుధవారం తమ సహచర విద్యార్థి అక్క నిశ్చితార్థ కార్యక్రమానికి బుచ్చిరెడ్డిపాలెంకు వెళ్లారు. తీరా అక్కడ కార్యక్రమాన్ని చూసుకుని తిరుగు ప్రయాణంలో రెండు కార్లు బయలుదేరాయి. ఈ నేపథ్యంలో ముందుకు ప్రయాణిస్తున్న కారులో సంగం మండలం సిద్ధిపురం గ్రామానికి చెందిన జి.జీవన్ చంద్రారెడ్డి(20) కారు డ్రైవింగ్ చేస్తుండగా.. అనంతరం గ్రామానికి చెందిన కె.అభిషేక్ రాజు (20), ధర్మవరంకు చెందిన ఎల్.నరేష్ నాయక్ (20), తిరుపతికి చెందిన జి.అభిషీ పురుషోత్తం (20), ప్రకాశం జిల్లాకు చెందిన జి.యగ్నేష్(20), కడపకు చెందిన నవనీత్ శంకర్‌లు ప్రయాణిస్తున్నారు. వెనుక వస్తున్న కారులో మరో 5 మంది మెడికో విద్యార్థులు ఉన్నారు. పోతిరెడ్డిపాలెం గంగవరం కాలువ దగ్గరకు వచ్చే సరికి వీరు ప్రయాణిస్తున్న కారు మితిమీరిన వేగంతో ఉంది. ఈ నేపథ్యంలో అదుపు తప్పిన ఈ కారు రోడ్డు పక్కనే వ్యాపారం చేసుకుంటున్న వెంకటరమణయ్య షాపును అతివేగంగా ఢీకొంది. ఈ సంఘటనలో షాపు ముందు భాగం పూర్తిగా ధ్వంసం కాగా ఆ ప్రాంతంలో ఉన్న ఫ్రిజ్ అక్కడ నుంచి దూరంగా పడిపోయింది. ఈ సంఘటనలో షాపులో కూర్చుని ఉన్న వెంకటరమణయ్య (55) తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందారు. ఈ నేపథ్యంలో వెనుక వస్తున్న కారులో వారు ప్రమాదంలో గాయపడిన ఆరు మందిని తమ కారులో తీసుకుని హుటాహుటిన నెల్లూరుకు బయలుదేరారు. వీరిలో జీవన్ చంద్రారెడ్డి, అభిషేక్ రాజు నెల్లూరులోని రామచంద్రారెడ్డి ఆస్పత్రిలో మృతిచెందగా.. నరేష్ నాయక్, అభిషీ, యగ్నేష్‌లు తీవ్రగాయాలపాలై నారాయణ ఆస్పత్రిలో మృతిచెందారు. వీరిలో కడపకు చెందిన నవనీత్‌శంకర్ తీవ్రగాయాల పాలై ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. రమణయ్య మృతదేహం నెల్లూరులోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఉంది.

**సంఘటనా స్థలంలో..** ప్రమాదం జరిగిన తీరు తెలుసుకున్న కోవూరు సీఐ వి. సుధాకర్‌రెడ్డి హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ మేరకు ట్రాఫిక్‌కు అంతరాయంగా ఉన్న కారును పక్కకు తరలించేలా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదానికి గల కారణాలను పరిశీలిస్తున్నామని, అసలు జాతీయ రహదారిలో మితిమీరిన వేగంతో ప్రయాణించడం ఎప్పటికైనా ప్రమాదమేనని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. ప్రమాదం జరిగిన తీరును పరిశీలిస్తే కారు అతివేగంగా ప్రయాణిస్తున్నట్లు తెలుస్తుందన్నారు. కారు ముందు సీట్‌లో ఉన్న ఎయిర్ బ్యాగ్ సైతం ధ్వసం కావడం ఈ వేగానికి నిదర్శనమన్నారు. ఈ మేరకు సంఘటనా స్థలంలో ఏఎస్సై సత్యనారాయణ, హెడ్ కానిస్టేబుల్ సతీష్, కానిస్టేబుల్స్ వేణు, రమేష్‌లు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేలా చర్యలు చేపట్టారు.

**గుండెలవిసేలా తల్లిదండ్రుల రోధన** ప్రమాదం జరిగిన తీరును పరిశీలించిన తర్వాత ఆస్పత్రికి వెళ్లిన జీవన్ చంద్రారెడ్డి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు గుండెలు పగిలేలా ఏడవడం చూపరులను కలిచివేసింది. డాక్టర్ అయి తమను ఆప్యాయంగా చూసుకుంటాడనుకున్న కొడుకు తమ కళ్లముందరే మరణించడం తీరని శాపంగా మారింది. మృతులంతా రెండవ సంవత్సరం మెడికల్ విద్యార్థులు కావడం గమనార్హం. వీరందరూ వేరువేరు జిల్లాలు అయినా స్నేహంలో మాత్రం ఒకటిగా ఉంటూ అందరూ మరణించడం అక్కడున్న ప్రతి ఒక్కరి హృదయాలను కలిచివేసింది. మరణంలో సైతం స్నేహితులు కలిసి మృతిచెందడం అక్కడున్న ప్రతి ఒక్కరిని కంటతడి పెట్టించింది.

## గుబ్బా బ్రదర్స్‌నేతృత్వంలో కూల్‌డ్రింక్స్ చలివేంద్రం



**బుచ్చి ఏఫ్రిల్ 30 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం బస్టాండ్‌లో గుప్తా బ్రదర్స్ గుబ్బా మల్లికార్జునరావు,గుబ్బా సురేష్ దంపతులు వేసవి సందర్భంగా కూల్ డ్రింక్స్ చలివేంద్రం ఏర్పాటు చేసి సుమారు 4 వందల మందికి పైన కూల్ డ్రింక్స్‌లు అందజేశారు.ఈ సందర్భంగా గుబ్బా బ్రదర్స్ మాట్లాడుతు వేసవి సందర్భంగా ప్రజలకు కొంత సేద తీర్చాలన్న ఆలోచనతో ఈకార్యక్రమాన్ని నిర్వహిం చినట్లు వారు తెలిపారు.

## సోమిశెట్టి, దామిశెట్టి కుటుంబాలను పరామర్శించిన రామిశెట్టి



**కావలిరూరల్, ఏప్రిల్30 ప్రభాతవార్త :**కావలి పట్టణంలో ఇటీవల ఉగ్రవాదుల దాడులలో మృతిచెందిన కావలివాసి సోమిశెట్టి మధుసూధన్ కుటుంబసభ్యులను,కాపునేత, పారిశ్రామికవేత్త దామిశెట్టి శ్రీనివాసులునాయుడు అకాలమృతితో వారి కుటుంబసభ్యులను బుధవారం రామిశెట్టి వెంకటసుబ్బారావు చారిటబుల్‌ట్రస్ట్ ఛైర్మన్ రామిశెట్టి వెంకటసుబ్బారావు పరామర్శించడం జరిగింది. అనంతరం ఇరువురి చిత్రపటాలకు పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. కుటుంబసభ్యులకు తన ప్రగాఢసానుభూతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉగ్రవాదుల దాడులను తీవ్రంగా ఖండిస్తూ ఇటువంటి సమయంలో భారతదేశం అంతా కులమతబేధాలు లేకుండా మీ కుటుంబానికి అండగా ఉంటుందని వారికి భరోసా కల్పించడం జరిగింది. దామిశెట్టి శ్రీనివాసులునాయుడు మృతిచెందడం కుటుంబసభ్యులకు తీరనిలోటు అని తెలియచేశారు. ఆయన వెంట రామిశెట్టి అనుచరులు పాల్గొన్నారు.

## బాస్కెట్‌బాల్ ఉచిత వేసవి క్రీడాశిక్షణ



**కావలిరూరల్, ఏప్రిల్30 ప్రభాతవార్త :** శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా క్రీడాసాధికార సంస్థవారి ఆధ్వర్యంలో కావలి విట్స్ ఇంజనీరింగ్ కళాశాల క్రీడాప్రాంగణంనందు బాస్కెట్‌బాల్ క్రీడలో ఉచిత వేసవి క్రీడాశిక్షణాశిబిరములు నిర్వహించబడునని విట్స్ ఇంజనీరింగ్ కళాశాల వ్యాయామ ఉపాధ్యాయులు పి.జోసఫ్ సుకుమార్, పి.భాస్కర్‌రావులు బుధవారం తెలియచేశారు. 16 సంవత్సరాల వయసులోపు గల బాలబాలికలు అర్హులని తెలియచేశారు. మే నెల 1వ తేదీనుండి 31వ తేదీవరకు బాస్కెట్‌బాల్ ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలియచేశారు. ఆసక్తిగల బాలబాలికలు మే నెల 1వ తేదీ ఉదయం 6 గంటలకు లేదా సాయంత్రం 4:30 గంటలకు బాస్కెట్‌బాల్ కోర్టులో హాజరుకావలెనని తెలిపారు. ఉదయం, సాయంత్రం రెండుపూటలా శిక్షణ ఉంటుందని తెలియచేశారు.

## మధుసూధన్ కుటుంబానికి ప్రతాప్‌రెడ్డి 5 లక్షలు ఆర్థికసహాయం

## పరామర్శించిన వైసిపి నేతలు



**కావలి, ఏప్రిల్30 ప్రభాతవార్త :** వైసిపి రాష్ట్ర అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలమేరకు బుధ వారం వైసిపినేతలు కావలి ఆనాల వారివీధిలో నివసిస్తున్న మధు సూధన్ కుటుంబాన్ని పరామర్శి ంచారు. వైసిపి కావలి నియోజ కవర్గ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళి, సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, నెల్లూరురూరల్ వైసిపి నియోజకవర్గ ఇన్‌చార్జి ఆనం విజయ్‌కుమార్‌రెడ్డిలు పరామర్శించారు. వైసిపి అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. మధుసూధన్ మృతిపట్ల సంతాపం వ్యక్తం చేశారు. ప్రగాఢసానుభూతిని తెలియచేశారు. కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి 5 లక్షల రూపాయలు ఆర్థికసహాయం అందచేస్తున్నట్లు ప్రకటించారు. ఉగ్రదాడిలో మధుసూధన్ మృతి ఎంతో బాధాకరమన్నారు. వారివెంట వైసిపి వాణిజ్యవిభాగం రాష్ట్ర ప్రధానకార్యదర్శి అమరావేదగిరి సుబ్బరాయుడుగుప్తా, వైసిపినేతలు పాల్గొన్నారు.

## మహిళలకు చీరలు అందచేసిన కందుకూరి దంపతులు

**కావలి, ఏప్రిల్30 ప్రభాతవార్త :** కావలి శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి పునఃప్రతిష్ఠా కుంబాభిషేక మహో త్స వాలకు సంబంధించి మే నెల 13వ తేదీ 1008 మహిళల కలశా ల ఊరేగింపుకు సంబంధించి బుధ వారం మహిళలకు కందుకూరి దం పతులు చీరలు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ శాశ్వత గౌరవాధ్యక్షులు కందుకూరి వెంకటసత్యనారాయణ, అధ్యక్షులు ఓలేటి నాగేశ్వరరావు, సివిసి సత్యం, బొగ్గవరపు వెంకటసత్యనారాయణ, మట్టా మల్లికార్జున, కందుకూరిబాబు, కందుకూరి సతీమణి మాజీ మున్సి పల్ కౌన్సి లర్ కందుకూరి పుష్పావతి, పెండ్యాల జాలవెంకటకుమారి, మట్టా పార్వతి, గాదంశెట్టి నివాస, ఒరుగంటి మానస, కందుకూరి అనంత లక్ష్మమ్మ, కందుకూరి సుభాషిణి, ఒరుగంటి సుష్మ, తదితరులు పాల్గొన్నారు.

## అన్ని డివిజన్లలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోండి



**– కమిషనర్ వై.ఓ. నందన్**

**నెల్లూరు కార్పొరే షన్, ఏప్రిల్ 30 ప్రభాత వార్త :** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధి లోని అన్ని డివిజన్లలో ప్రతి 14 రోజులకు ఒకసారి ఫాగింగ్ ప్రక్రియను అమలు చేస్తూ, ఆయిల్ బాల్స్ పిచికారి, గంబుజియా చేప పిల్లల పెంపకం తదితర కార్యక్రమాలతో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కమిషనర్ వై.ఓ. నందన్ సూచించారు. ఇంజనీరింగ్ విభాగం, పబ్లిక్ హెల్త్ విభాగం, వార్డ్ సచివాలయ శానిటేషన్ కార్యదర్శులతో సమీక్ష సమావేశాన్ని కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పి. నారాయణ సూచనల మేరకు హ్యాండ్ ఫాగింగ్ మెషిన్ల ద్వారా ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు, సాయంత్రం 4.30 నుంచి 7 గంటల వరకు మాత్రమే ఫాగింగ్ ప్రక్రియను అన్ని డివిజన్లలో పూర్తి చేయాలని సూచించారు. ప్రతిరోజు జరిపే ఫాగింగ్ ప్రక్రియ పూర్తి వివరాలను కార్యాలయంలోని ఉన్నతాధికారులకు తప్పనిసరిగా నివేదికలను నివేదించాలని తెలిపారు. డ్రైను కాలువల పూడికతీత పనులతో పాటు పూర్తిస్థాయిలో సిల్ట్ తొలగించేందుకు నగరం మొత్తం చిన్న కాలువలు,పెద్ద కాలువలు మొత్తం డీసిల్టేషన్ పని మొదలుపెట్టనున్నామని రామలింగాపురం రోడ్డు నందు గ్యాంగ్ వర్క్ చేపట్టి డ్రైను కాలువలను ఆక్రమిస్తూ నిర్మించిన ఆక్రమణలు, ర్యాంపులు, మెట్లను తొలగించి వంద శాతం సిల్ట్ తొలగింపు పనులను పూర్తి చేస్తున్నామని తెలిపారు. గత కొన్నేళ్ల నుంచి పేరుకుపోయిన సిల్ట్ ను మిషన్ల సహాయంతో తొలగించడంతో దోమల ఎదుగుదలకు అవకాశం లేకుండా పోయిందని, వాటి పూర్తి నిర్మూలనకు పూడికతీత పనులు ఉపయుక్తమవుతాయని తెలిపారు. 24 గంటల్లో గార్బేజిల నుంచి చెత్తను సేకరించే విధంగా ప్రణాళికలు రూపొందించుకుని, ఇంటింటి చెత్త సేకరణలో తప్పనిసరిగా తడి, పొడి చెత్తను విడిగా సేకరించేలా పారిశుద్ధ సిబ్బందిని క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని సూచించారు. శానిటేషన్ మేస్త్రీలు విధుల్లో బాధ్యతగా వ్యవహరించాలని, విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.అన్ని డివిజన్లలో క్రమం తప్పకుండా డ్రైన్ కాలువల పూడికతీత, సిల్ట్ ఎత్తివేత పనులను చేపట్టాలని, తడి పొడి చెత్తను విడివిడిగా సేకరించేలా సిబ్బందిని పర్యవేక్షించాలని కమిషనర్ ఆదేశించారు. అలాగే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కనెక్షన్లు తీసుకొని విషయంలో నగర ప్రజలకు అవగాహన కల్పించి కనెక్షన్లు తీసుకునేలా చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు.నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని వ్యాపారాలకు ట్రేడ్ లైసెన్సులు తప్పనిసరి అని, సచివాలయాల వారిగా సంబంధిత శానిటేషన్ కార్యదర్శులు వ్యాపారస్తులంతా ట్రేడ్ లైసెన్సు లు తీసుకునేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు.ఈ సమావేశంలో ఇంజనీరింగ్ విభాగం ఎస్.ఇ. రామ్ మోహన్ రావు, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ చైతన్య, మలేరియా విభాగం అధికారి జిజియా బాయి, వెటర్నరీ వైద్యులు డాక్టర్ మదన్ మోహన్, సిటీ ప్లానర్ పద్మజ, శానిటేషన్ సూపర్వైజర్లు, ఇన్స్పెక్టర్లు, వార్డ్ సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు, మేస్త్రీలు, సిబ్బంది పాల్గొన్నారు

## దామిశెట్టి కుటుంబసభ్యులను పరామర్శించిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే



**కావలి, ఏప్రిల్30 ప్రభాతవార్త :** కావలి డిబియస్ ఇంజనీరింగ్ కళాశాల ఛైర్మన్, వైసిపినేత దామిశెట్టి శ్రీనివాసులునాయుడు ఉత్తరక్రియల్లో బుధవారం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, టిడిపి జాతీయప్రధానకార్యదర్శి ఎమ్మెల్సీ బీద రవిచంద్రలు పాల్గొన్నారు. శ్రీనివాసులు నాయుడు చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రగాఢసానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి లీగల్‌సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పోట్లూరి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

## యువత వ్యాపార రంగంలో రాణించాలి - ఎమ్మెల్యే



**వింజమూరు, ఏప్రిల్ 30, ప్రభాతవార్త :** వింజమూరు, కావలి రహదారి శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయ సమీపంలో శ్రీ కామాక్షి గ్రానైట్స్, మార్బుల్స్ దుకాణంను ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చేతుల మీదుగా బుధవారం ప్రారంభించారు. అర్చకులు ముందుగా భాస్యం ఎరుకుల నాయుడు ఆ దంపతులచే పూజా కార్యక్రమాలు జరిపించారు. షాపు ప్రాంగణ ఆవరణలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత వ్యాపార రంగంలో రాణించాలని తాను ఉపాధి పొందుతూ పది మందికి ఉపాధి అవకాశాలు కల్పించాలని ఎమ్మెల్యే తెలిపారు. ఉదయగిరి నియోజకవర్గంలోని అతి పెద్ద మండలం వింజమూరు అన్ని రంగాల్లో ముందంజలో ఉందని, నియోజకవర్గానికి మధ్య ప్రాంతంలో ఉండడంతో ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున ఉద్యోగస్తులు, వ్యాపారస్తులు ఇంటి నిర్మాణ రంగం చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇంటినిర్మాణాలు జరుగుతున్న తరుణంలో ఇలాంటి దుకాణాలను ఏర్పాటు చేయడం ఉపయోగకరంగా ఉంటుందని ఆయన అన్నారు. సామాన్య ప్రజలకు ధరలు అందుబాటులో ఉండే విధంగా నిర్ణయించి అందజేయాలని సూచించారు. క్రమ క్రమంగా వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా అభివృద్ది చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దుకాణ యజమాని కుటుంబ సభ్యులు బంధువులు తెలుగుదేశం మండల కన్వీనర్ గొంగటి రఘునాథరెడ్డి, నాయకులు జిల్లా తెలుగుదేశం కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లు యాదవ్, మాజీ మండల కన్వీనర్ గూడా నర్సారెడ్డి, వి.వెంకట సుబ్బారెడ్డి, యారం కృష్ణయ్య, మహేంద్ర ప్రసాద్, పి.మాల్యాద్రి నాయుడు, కేవిస్ నాయుడు, ఎమ్మెస్ నాయుడు, గురజాల వెంకట రమణయ్య, గణపం సుదర్శన్‌రెడ్డి, తిరుపతి ఆచారి, దుద్దుగుంట శ్రీనివాస్‌రెడ్డి, జనసేన మండలాధ్యక్షుడు బండారు సత్యనారాయణ, కలిగిరి తెలుగుదేశం పార్టీ నాయకులు పూసల వెంగప్ప నాయుడు, సుబ్బారెడ్డిపై రమణారెడ్డి, ఇతర ముఖ్యనాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## కౌమర దశలో ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి



**వింజమూరు, ఏప్రిల్ 30, ప్రభాతవార్త :** బాలికలు కౌమర దశలో తగిన విధంగా జాగ్రత్తలు తీసుకొని నడుచుకోవాలని ఎంపీడోఈ కే.శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి సీహెచ్ పద్మజ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎంపీడీఓ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో కిశోర బాలికలు కౌమర దశకు రాగానే అనేక సమస్యలను ఎదుర్కొంటుంటారని ముఖ్యంగా ఆకర్షణ ప్రేమ తదితర సమస్యలను సమర్ధవంతంగా ఆలోచించే విధంగా తన మాననిక ప్రవర్తనను ఉంచుకోవాలన్నారు. కౌమర దశలో మనసు చంచలంగా ఉంటుందని అలాంటప్పుడు ఏదీ మంచి ఏదీ చెడు అనేటువంటి ఆలోచన ఉండదని ఆయన తెలిపారు. అలాంటి సమయంలో తల్లిదండ్రుల పట్ల భయభక్తులు కలిగి ఉండాలని తెలిపారు. బాలికలు తమ జీవిత భవిష్యత్తును ఎంచుకుని అందుకు అనుగుణంగా ప్రవర్తించాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షకీలా మాట్లాడుతూ బాలికలు కౌమర దశకు రాగానే అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని తెలిపారు. రుతుక్రమం వ్యక్తిగత పరిశుభ్రత ఇతరుల పట్ల ఆకర్షణ ఇలాంటి విషయాలలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అదే విధంగా ఎప్పుడైనా ఎవరైనా ఎక్కడ తాకాలి ఎక్కడ తాకకూడదో తెలియజేశారు. బాలికల్లో తాకకూడని ప్రదేశాలలో తాకినట్లయితే తమ యొక్క ఆలోచన పరంపరలో మార్పులు వస్తాయని అప్పుడే జీవితగమనము ఈదారి తప్పుతుందని తెలిపారు. కాబట్టి తల్లిదండ్రులు కూడా బిడ్డల పట్ల తగిన జాగ్రత్తలు వహించాలన్నారు. వారికి తగిన విధంగా సూచనలు సలహాలు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు సిబ్బంది, ఆశా వర్కర్లు ఉన్నారు.

## ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తా: ఎమ్మెల్యే



**వరికుంటపాడు,ఏప్రేల్30,ప్రభాతవార్త :** నియోజకవర్గంలో వున్న ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని ఉదయ గిరి శాసనసభ్యుడు కాకర్ల సురేష్ అన్నారు. బుధవారం మంలం లోని జి కొండా రెడ్డిపల్లి గ్రామంలో మండలపార్టి కన్వీనర్ చంద్రా మధుసూ దన్‌రావు నేతృత్వంలో వైకాపా నుంచి తెలుగు దేశం పార్టిలో సీనియర్‌నాయకుడు మూలే వీరారెడ్డి ఆధ్వర్యంలో 80కుటుంబాలకు చెందిన వారుఎంఎల్ఎ కాకర్ల సురేష్ సమక్షంలో పార్టి చేరారు.వారికి ఎంఎల్ పార్టీ కుందువాలు కప్పి ఆహ్వానించారు.ముందుగ సిసి రోడ్‌లను ప్రారంభించారు.అనంతరం జరిగిన సభలో మూలే వీరారెడ్డికి కందువకప్పి ఆహ్వానిం చారు.ఈసందర్భంగ కాకర్ల మాట్లాడుతు గత ఐదేళ్లలో రాష్ట్రం వెనుకంజలో వుందని లిక్కర్‌స్కామ్ లు,అరాచకాలు,కుంబకోణాలు జరిగాయన్నారు.ఎన్నడులేని విధంగ జగన్ పాలనలోరాష్ట్రం అప్పులుపాలయ్యిందన్నారు.కూటమి ప్రభుత్వం వచ్చిన 11నెలల్లోనే ఉదయగిరి నియోజకవర్గంలో వందకోట్లకు పైగ అభివృద్ధి పనులు చేశానని మరో 50కోట్ల పనులకు శ్రీకారం చుట్టామన్నారు.ఒకటవతేది ఆత్మకూరులో జరగబోయె ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటనను రెండవతేది అమరావతిలో ప్రధాని నరేంద్రమోది పర్యటనను నేతలు కార్యకర్తలు విజయవంతంచేయాలని పిలుపునిచ్చారు.తన స్వంత మండలమైన వరికుంటపాడులో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో మాజి ఎంఎల్ఎ కంభం విజయరామిరెడ్డి,మాజి జటొపి ఛైర్మన్ చెంచల్‌బాబు యాదవ్,జటొపిటిసి సభ్యులు రావెళ్ళ నాగేంద్ర,మండల నేతలు పోలుబోయిన శ్రీకాంత్‌యాదవ్,మజ్జె లక్ష్మీనారాయణ,వైస్ ఎంపిపి దేవనబోయిన మధు,రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్ ఆవుల ఆరుణ,నేతలు కుమ్మిత రమణారెడ్డి,కుమ్మిత నరసారెడ్డి, అంద్ర నాగిరెడ్డి,కామేపల్లి వెంకటరత్నం,అంద్ర బాలగురు వారెడ్డి,గంగవరపు పుల్లయ్య,జి మాలకొండ్రా యుడు,చంద్ర వెంకయ్య, ఆరోన్, వెంకటరత్నం, కొండల్‌రావు.ౕ ఎరం సుధాకర్‌రెడ్డి, లాభాన్, జనసేన మండలపార్టి అధ్యక్షుడు పఠాన్‌రసూల్ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రాపూరు సివిల్ సప్లయిస్ గోడౌన్‌లో విజిలెన్స్ తనిఖీలు



**రాపూరు,ఏప్రిల్30ప్రభాతవార్త :** మండల కేంద్రమైన రాపూరులోని సివిల్ సప్లయిస్ గోడౌన్‌లో బుదవారం నెల్లూరు విజిలెన్స్అధికారులు తనిఖీలు నిర్వహించారు. గోడౌన్‌లో తూకాలలో మోసాలు జరుగుతున్నాయన్న విషయంపై ఈ తనిఖీలు నిర్వహించినట్లు తెలస్తుంది. ఈ సందర్భంగా విజిలెన్స్ అధికారులు గోడౌన్‌లో వున్న సరకు నిల్వలను తనిఖీ చేశారు. అయితే తనిఖీల విషయంలో మిడియాకు సమాచారం లేకుండా గోప్యంగా ఈ తనిఖీలు నిర్వహించారు. డీలర్లకు చేరకు చేరని సరకు లు..మే నెలలో పేదలు పస్తులేప్రతి నెల 27వ తేది లోపు గోడౌన్ పరిధిలోని రాపూరు,కలు వాయి,సైదాపురం మండలా లలకు బియ్యం సరఫరా చేసేవారు. అయితే ఈ పర్యాయం బియ్యం రవాణా చేసే కాంట్రాక్టర్‌ను మార్చి మరోకరికి రవాణా భాధ్యతలు అప్పచెప్పడంతో గోడౌన్ పరిధిలో 125 రేషన్ షాపులు వుండగా ఏప్రిల్ 30 వ తేది వరకు కేవలం మూడు మండలాల్లో 41 చౌక దుకాణాలకు మాత్రమే బియ్యం సరఫరా చేసారు. దీంతో మే నెలలో నిరుపేదలకు చౌక దుకాణాల ద్వారా బియ్యం సకాలంలో సరఫరా జరిగే పరిస్థితి లేదు. ఇప్పటికైనా జిల్లా రెవెన్యూ ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని గోడౌన్ పరిధిలోని అన్ని రేషన్ దుకాణాలకు రేషన్ బియ్యం సరపరా చేసి నిరుపేదలు పస్తులు లేకుండా వుండేలా బియ్యాన్ని అందించాల్సి న అవసరం ఎంతైనా వుంది.

## మినీ జెసిబి సాయంతో మురుగు కాలువల క్లీనింగ్



రాపూరు,ఏప్రిల్30ప్రభాతవార్త మండల కేంద్రమైన రాపూరులోని మురుగుకాలువలలో పేరు కుపోయి వున్న చెత్తను మీని జెసిబి ద్వారా శుభ్రపరుస్తున్నట్లు పంచాయితీ కార్యదర్శి కవిత తెలిపారు. బుదవారం రాపూరులోని పలు ప్రాంతలలో వున్న మురుగు కాలువలను ఈ జెసిబి సాయంతో పెరుకుపోయి వున్న చెత్తను శుభ్రపరిచి ట్రాక్టర్ ద్వారా డంఫింగ్ యార్డుకు తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ జెసిబిని పొదలకూరు నుండి జిల్లా పంచాయితీ అధికారుల సాయంతో తీసుకోని వచ్చినట్లు తెలిపారు. ఈ జెసిబి సాయంతో పట్టణంలోని అన్ని సైదు కాలువలలో పేరుకుపోయి వున్న చెత్తను తోలగిస్తామని ఆమె తెలిపారు.

## కండలేరులో 45.288 టీయంసీల నీటిమట్టం

రాపూరు,ఏప్రిల్30ప్రభాతవార్తమండలంలోని కండలేరు జలాశయంలో బుదవారం ఉదయం నాటికి జలాశయంలో 45.288 టీయంసీల నిటిమట్టం నమెదు అయినట్లు కండలేరు ఎఇ తిరుమలయ్య తెలిపారు. జలాశయం నుండి హెడ్ రెగ్యులేటర్ ద్వారా 270 క్యూసెక్కులు, లో లేవల్ స్యూయిస్ ద్వారా 50 క్యూసెక్కులు, హైలెవల్ కెనాల్ ద్వారా 30 క్యూసెక్కుల చొప్పున మొత్తం 350 క్యూసెక్కులు అవుట్ ఫ్లోగా వెలుతున్నట్లు ఆయన తెలిపారు.

## రసా బసగా జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం

**– నెల్లూరు జిల్లా పరిషత్ 2025 – 26 నకు 379 కోట్లతో బడ్జెట్ ఆమోదం**

**– గ్రామాల్లో మంచినీటి కొరతలేకుండా పటిష్టమైన చర్యలు**

**– జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ ఆనం అరుణమ్మ**



**నెల్లూరు కలెక్టరేట్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త :** ప్రస్తుతం వేసవికాలంలో గ్రామాల్లో మంచినీటి కొరతలేకుండా పటిష్టమైన చర్యలు తీసు కోవాలని జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ ఆనం అరుణమ్మ కోరారు. బుధవారం జెడ్పి హాల్లో 2025 – 26 బడ్జెట్ ఆమోదం ఇతర అంశాలకు సంబంధించి జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. శాసన మండలి సభ్యులు బల్లి కళ్యాణ్ చక్రవర్తి, కావలి శాసన సభ్యులు కృష్ణ రెడ్డి, డి ఆర్ ఓ ఉదయభాస్కర్, జెడ్పి సి ఇ ఒ విద్యారమ పాల్గొన్నారు. వేసవిలో మంచినీటి ఎద్దడి నివా రణ చర్యలు, కావలి కాలువ మరమ్మత్తు పనులు, చింతారెడ్డి పాలెం వద్ద అండర్ పాస్ నిర్మాణం, జల్ జీవన్ మిషన్ పనులు, జెడ్పి గ్రాంట్ నిధులతో చేసే అభివృద్ధి పనుల శంఖుస్థాపనకు జెడ్పి ఛైర్ పర్సన్, జెడ్పిటిసి సభ్యులను ఆహ్వానించకపోవడం, పెండింగ్‌లో ఉన్న జెడ్పిటిసి సభ్యుల గౌరవ వేతనం వంటి సమస్యలను సభ్యులు ప్రస్తావించారు. ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించే విధంగా అన్ని శాఖల అధికారులకు తెలియజేస్తామని డి ఆర్ ఒ తెలిపారు. అదేవిధంగా ఎంతోకాలంగా పెండింగ్ లో ఉన్న జెడ్పిటిసి సభ్యుల గౌరవ వేతనం గురించి జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి విన్నవిస్తామని జెడ్పి సి ఇ ఒ తెలిపారు. గత సమావేశం లో తాము అడిగిన ప్రశ్నలకు స్పందించి తీసుకున్న చర్యల వివరాలను యం ఎల్ సి బల్లి కళ్యాణ్ చక్రవర్తి తెలుసుకున్నారు. బడ్జెట్ ప్రతిపాదనలను వివిధ అంశాల వారీగా వివరిస్తూ గత సంవత్సర సవరించిన ఆదాయ వ్యయాలు, 2025 – 26 బడ్జెట్ ప్రతిపాదనలను డిప్యూటీ సీఈవో మోహన్ రావు సభ ముందుంచారు. జెడ్పి ఛైర్ పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ 2025 – 26 సంవత్సరానికి గాను ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిషత్ బడ్జెట్ 379,80,03,800 రూపాయల అంచనాతో ఆమోదించినట్లుగా తెలిపారు. జిల్లా పరిషత్, పంచాయతీరాజ్ మరియు ఆర్డబ్ల్యూఎస్ విభాగం యొక్క ఆదాయ వ్యయాలను కలుపుకొని తయారు చేసినట్లుగా వివరించారు. 2024 – 25 సంవత్సరంనకు సవరించిన అంచనాలు ప్రకారం 354 కోట్లు ఆదాయం గాను, 343 కోట్లు వ్యయం గాను, అలాగే 2025 – 26 సంవత్సరంనకు బడ్జెట్ అంచనాలు 379 కోట్లుగా, వ్యయం 368 కోట్లుగా తయారు చేసి, 10 కోట్లు మిగులు బడ్జెట్‌తో అంచనాలు తయారుచేసినట్లుగా వివరించారు.

## సి ఎం పర్యటన ఏర్పాట్లలో కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్,ఏప్రిల్ 30 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు శ్రీ. నారాచంద్రబాబు నాయుడు నెల్లూరు జిల్లా ఆత్మకూరు పర్యటనను పురస్కరించుకొని నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై. ఓ. నందన్ కు ప్రత్యేక బాధ్యతలను కేటాయించారు.ముఖ్యమంత్రి సభా ప్రాంగణం, పరిసర ప్రాంతాలలో పారిశుధ్య పనుల నిర్వహణ, సుందరీకరణ పనులు, రోడ్ల మరమ్మతు పనులు, వివిఐపీల పార్కింగ్ నిర్వహణ, క్యాటరింగ్ విభాగం నిర్వహణ తదితర అంశాలపై పూర్తిస్థాయి అధికారిగా నందన్ నియమించబడ్డారు. ఆ ఉత్తర్వుల మేరకు కమిషనర్ వై.ఓ నందన్ బుధవారం ఆత్మకూరు నియోజకవర్గం పరిధిలోని ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

## పవన్‌కళ్యాణ్ 50లక్షల ఆర్థిక సహాయం అభినందనీయంజనసేన నాయకులు

**కావలి, ఏప్రిల్30 ప్రభాతవార్త :** ఇటీవల జరిగిన ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన మధుసూధన్ కుటుంబానికి జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ 50లక్షలరూపాయల ఆర్థిక సహాయం చేయడం ఎంతైనా అభినందనీయమని జనసేనపార్టీ నాయకులు తెలిపారు. కావలి పట్టణ జర్నలిస్ట్‌క్లబ్‌లో బుధవారం జనసేన నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జనసేనపార్టీ సీనియర్‌నేత నూనె మల్లికార్జునయాదవ్, జిల్లా ప్రధానకార్యదర్శి గునుగుల కిషోర్, జిల్లా కార్యదర్శి సమ్మన వెంకటసుబ్బయ్యలు మాట్లాడారు. ఉగ్రవాదం చర్యలను తీవ్రంగా ఖండించారు. మధుసూధన్ కుటుంబానికి జనసేనపార్టీ అండగా నిలుస్తుందని పవన్‌కళ్యాణ్ భరోసా ఇవ్వడం ఆయన నిబద్ధతకు నిదర్శనమన్నారు. పవన్‌కళ్యాణ్ ఎల్లప్పుడూ ప్రజలపక్షాన నిలుస్తారన్నారు. మధుసూధన్ కుటుంబానికి అన్నివిధాలా సహాయం చేస్తామని పవన్‌కళ్యాణ్ హామీ ఇచ్చారన్నారు. పవన్‌కళ్యాణ్ ప్రకటించిన 50లక్షల ఆర్థిక సహాయం మధుసూధన్ కుటుంబానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఉగ్రవాదులను కూకటివేళ్లతో పెకలించివేయాలని డిమాండ్ చేశారు. జనసేనపార్టీ క్రియాశీలక సభ్యుడు మధుసూధన్ కుటుంబానికి 5 లక్షలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా పార్టీ ఆఫీసు ఇన్‌చార్జి షేక్.జమీర్, పట్టణ ఉపాధ్యక్షుడు గాదంశెట్టి రవికుమార్, జిల్లా నాయకులు పవన్‌కుమార్‌యాదవ్, దగదర్తి మండల అధ్యక్షులు వెంకట్‌యాదవ్, సీనియర్ నాయకులు కోకల వెంకటేశ్వర్లు, పాలడుగు వెంకటేశ్వర్లు, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## కావలి ఎమ్మెల్యే ని సత్కరించిన డిసిసిబి ఛైర్మన్



**కావలి, ఏప్రిల్30 ప్రభాతవార్త :** డిసిసిబి ఛైర్మన్‌గా నూతనంగా నియమితులైన మెట్టుకూరి ధనుంజయరెడ్డి బుధవారం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాతో సత్కరించి పూలబొకే అందచేశారు. అనంతరం ఛైర్మన్ ధనుం జయరెడ్డిని ఎమ్మెల్యే దగుమాటి కూడా సత్కరించారు.

## ప్రతిభ సాధించిన విద్యార్థులును అభినందించిన అరుణమ్మ



**నెల్లూరు కలెక్టరేట్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త :** జిల్లా ప్రజా పరి షత్ కార్యాలయంలో బుధ వారం 2025 మార్చిలో నిర్వహి ంచిన 10వ తరగతి పరీక్షలలో 595 మార్కులు సాధించి మొదటి స్థాన ములో నిలిచిన చి. యం. పూజిత, జడ్పిపిహెచ్ఎస్, క్రిషి నగర్, 594 మార్కులు సాధించి రెండవ స్థానములో నిలిచిన యం.డి. జువేరియా, జడ్పిపిహెచ్ఎస్, నవలకుల గార్డెన్స్, 593 మార్కులు సాధించి మూడవ స్థానములో నిలిచిన ఇద్దరు విద్యార్థులు చి.జి. జ్ఞాపిక, జడ్పిపిహెచ్ఎస్, వింజమూరు, చి.జి. భార్గవ్, ఎంవిఆర్ఆర్‌జడ్పిపిహెచ్ఎస్, నర్సాపురం విద్యార్థులకు జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ అరుణమ్మ అభినందన జ్ఞాపికలు అందచేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు క్రిషి నగర్, ప్రధానో పాధ్యాయులు హెచ్‌ఎం ఎం. గిరిధర్ సింగ్ గని, జడ్పిపిహెచ్ఎస్, నవలకుల గారెన్స్ ప్రధానో పాధ్యాయులు హెచ్ఎం పి. శ్రీనివాసులుని, జడ్పిపిహెచ్ఎస్ వింజమూర్ ప్రధానోపాధ్యాయులు సిహెచ్ మాలకొండయ్య ని, ఎంవిఆర్ఆర్‌జడ్పిపిహెచ్ఎస్, నరసాపురంలో ప్రధానోపాధ్యాయులు పి నాగేశ్వరరావుని ఈ సందర్భంగా శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజా పరిషత్ ఛైర్ పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు క్రమ శిక్షణతో శ్రద్ధగా చదువుకొని పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు, జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకొనిరావాలని వారి బంగారు భవిష్యత్తుకు పునాదులు వేసుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ సీఈఓ యం. విద్యారమ, డిప్యూటీ సీఈవో మోహన్ రావు, విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.

## టోల్ గేట్ వద్ద బైక్ ఆదుపుతప్పి యువకునికి తీవ్ర గాయాలు



రాపూరు,ఏప్రిల్30ప్రభాతవార్త జాతియ రహదారి 565పై వెలుగోను గ్రామం వద్ద వున్న టోల్‌గేట్ సమీపంలో వేగంగా వస్తున్న బైక్ ఆదుపుతప్పి పడిపోవడంతో బైక్‌పై వున్న యువకునికి తీవ్ర గాయాలయ్యాయి. తిరుపతి జిల్లా,డక్కిలి మండలం, డి వడ్డిపల్లి గ్రామానికి చెందిన వెంకట ప్రసాద్ అనే యువకుడు పెంచలకోనకు వెల్లి తిరిగి తన స్వగ్రామం వెల్లేందుకు బుల్లేట్ బైక్‌పై వస్తూ టోల్‌గేట్ సమీపంలో వున్న స్పీడ్ బ్రేకర్ వద్ద బైక్ ఆదుపుతప్పి పడిపోవడంతో వెంకట ప్రసాద్ రోడ్డుపై పడిపోయాడు. వెంటనే టోల్‌గేట్‌లో వున్న సిబ్బంది, అక్కడే వున్న హైవే అంబులెన్స్ లో క్షతగాత్రుని చికిత్స నిమిత్తం రాపూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వార్త VAARTHA CLASSIFIEDS

CLASSIFIEDS

CHANGE OF NAME

★ I Mohammad Muntaz D/O, Mohammad Arif R/o Laxmi Nilayam, 1st Line, Near Ramalayam, Karedu, Nellore - 523292 have changed my name to Maansi Varma for all purposes.

(Ro.No.3892)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

